

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 238 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 28, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 238 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 28, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# హైడ్రాపై ఆక్రోషపు అక్కసు!






- ప్రభుత్వ ఆస్తుల రక్షణదారునిపై పగబడుతున్నారు
- చెరువుల పునరుద్దారనలో చరిత్ర సృష్టించిన హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్
- న్యాయస్థానాలు చట్టాలు ప్రభుత్వ కార్యాలయాలు చేయాల్సిన పనులు హైడ్రా కమిషనర్ చేసి నిరూపిస్తున్నారు
- దొంగ పత్రాలు సృష్టించుకుని చలామణి అవుతున్న భూకబ్జాదారుల పరిస్థితి ఏంది
- చెరువులను రక్షించకపోతే హైదరాబాద్ ఉన్నపాటుగా నశించిపోతుంది
- ప్రతి ఒక్కరూ ప్రశ్నించే వాళ్లే పని చేసే వాళ్ళు ఎవరు
- ప్రభుత్వం తరపున వేల కేసులు కోర్టులలో మూలుగుతున్నాయి
- దాపరికం లేదు దూసుకుపోవడమే ప్రభుత్వ ఆస్తులను కాపాడడమే హైడ్రా లక్ష్యం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఐపీఎస్ పై అపోహలు వద్దు,అసత్య ప్రచారాలు చేయొద్దు
- అక్రమార్కులను దంచి కొట్టడంలో దమ్మున్న మొనగాడు ఏవి రంగనాథ్
- పరిమితులు లేని పరిజ్ఞానం కలిగిన పోలీస్ ఆఫీసర్ ఐజి ఏవి రంగనాథ్
- గాలి మాటలు ఎవరైనా మాట్లాడుతారు స్వాభావికంగా పనిచేయడం చాలాకష్టం
- చెరువులను రక్షించడం అనేది కొన్ని తరాలకు ఉపయోగకరం
- డాక్టర్ బరిగెల శివ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైడ్రా పదికాలాల పాటు చల్లగా ఉండాలని డాక్టర్ బరిగెల శివ విజ్ఞప్తి చేశారు.సుమారుగా 80 సంవత్సరాల తర్వాత హైదరాబాద్ ప్రాంతంలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే హైడ్రా కమిషనర్ ఐజి ఏవి రంగనాథ్ ఐపీఎస్ తెలంగాణ హైడ్రా కమిషనర్ గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నియమించాక సుమారుగా 1,50,000 కోట్ల రూపాయలకు చెందిన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, నాలెలను, ప్రభుత్వ భూములను, రక్షించగలిగినారని హైడ్రా సృష్టించిన ప్రభుత్వ భూముల రక్షణ భాగంలోని విధులు దేశంలోని అన్ని రాష్ట్రాలను ఆలోచింపజేస్తుందని గుర్తు చేశారు.పక్కరాష్ట్రాలు హైడ్రాను ఆదర్శంగా తీసుకొని చెరువులను రక్షించుకోగలిగితే ఆయా ప్రాంతాలన్నీ రక్షణ వలయంలో ఉండగలవని బాహాటంగా విశ్వసిస్తూ హైడ్రాను అభినందిస్తున్న సందర్భాలు లెక్కలేనన్ని కలవన్నారు.హైదరాబాద్ ప్రాంతంలో ఎక్కడ చూసినా హైడ్రా విజృంభన తాకిడికి తట్టుకోలేని భూకబ్జా దారులందరూ తోక ముడుచుకొని భూకబ్జాలు చేయడం పూర్తిగా మానివేశారని అదే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వాలకు అతీతంగా చెరువులలో అక్రమ కట్టడాల నిర్మాణాలను కూల్చివేస్తూ హైడ్రా సృష్టిస్తున్న చరిత్ర జాతీయస్థాయి అంచనాలను దాటిపోగలిగే స్థాయికి చేరువైందన్నారు. హైడ్రా ప్రారంభంలో ఎన్ కన్వెన్షన్ కూల్చివేయడం ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునను తట్టుకొని నిలబడడం కేవలం రంగనాథుని

- మిగతా 2లో..






## నేరెళ్ల బాధితులకు అండగా కల్వకుంట్ల కవిత

రేపు బాధితులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ పరామర్శ

9 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న నేరెళ్ల బాధితులు



2

## రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నాను

చెరువులు.. ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నాను

ఏవీ రంగనాథ్ హైడ్రా కమిషనర్




2

## నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు




2

## న్యాయస్థానాల్లో నకిలీ న్యాయవాదులు !

దేశంలో 48 వేల నకిలీ అడ్వకేట్లు ఉన్నారనే వ్యాఖ్యపై తీవ్ర చర్చ


న్యాయవ్యవస్థ, బార్ కౌన్సిల్ పర్యవేక్షణపై ప్రశ్నల వర్షం

డిగ్రీలు, లైసెన్సుల ధ్రువీకరణలో లోపాలపై విమర్శలు

ప్రజల న్యాయ విశ్వాసాన్ని దెబ్బతీస్తున్న పరిణామాలపై ఆందోళన

దేశవ్యాప్తంగా అడ్వకేట్ల డిజిటల్ వెరిఫికేషన్‌కు డిమాండ్

నకిలీ సర్టిఫికెట్లతో ప్రాక్టీస్ చేసిన వారిపై కఠిన చర్యలు కోరుతూ పిలుపు



3

# రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నాను


**చెరువులు.. ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నాను**
**ఏవీ రంగనాథ్ హైడ్రా కమిషనర్**




**హైదరాబాద్, జులై 27 జై భీమ్ న్యూస్:**

ఐజి ఏవి రంగనాథ్ ఐపీఎస్ అను నేను రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్ గా రాజ్యాంగ స్ఫూర్తి ననుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,48ఏ ప్రకారం ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు రక్షించడం జరిగింది. మార్కెట్లో వీటి విలువ రూ. 1.50 లక్షల కోట్లు ( 17 బిలియన్ డాలర్లు). ఆరు చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాం. మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. బడా బాబులు ఆక్రమించిన వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూముల ను హైడ్రా ఈ రెండు సంవత్సరాల లో వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించింది. నిజం వైపు నిజాయితీ గా నిర్భయంగా, నిబద్ధతతో పని చేస్తాం కాబట్టే హైడ్రా కు ధైర్యం. ల్యాండ్ మాఫియా , భూ కబ్జా దారులు తప్పుడు సమాచారం తో కోర్ట్ లను తప్పు దోవ పట్టిస్తున్నారు. లోతుకుంట భూమి విషయం లో దాదాపు పది వేల కోట్ల రూపాయల భూమిని శాంతా శ్రీరామ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కొట్టేయాలని చూసింది. పర్మిషన్స్ లేకుండా 2500 కోట్ల సంవత్స రాల హెరిటేజ్ గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ వందల చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా లేకుండా విచ్చల విడిగా విధ్వంసం చేసింది. సేవ్ ది రాక్ సొసైటీ,పర్యావరణ వేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన కంప్లైంట్ మీద హైడ్రా రంగం లో కి దిగింది. ఎక్కడో మూడు కిలోమీటర్ల అవతల ఉందని చెబుతూ లేని భూమిని చూపిస్తూ, ఈ బిల్డర్ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి వచ్చి ఆక్రమించి నా మీద కంటెంప్ట్ కేసు వేయటం జరిగింది. నా మీద 63 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి.. వాటిని వేసింది బడా భూ కబ్జా దారులే. బతుకమ్మ కుంట చెరువును మింగేయాలని చూసిన ఒకరు, లోతుకుంటలో రూ. వేల కోట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయాలని చూసిన ఇంకొకరు, సామాన్యుల ప్లాట్లు కొట్టేసి బడా కాంప్లెక్స్ లు కట్టాలని చూస్తున్న సంధ్యా శ్రీధర్ రావు, వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్స్ ను కొట్టేయాలని చూసిన ఒక నల్ల మల్లా రెడ్డి, క్రిమినల్ మాఫియా గా చెలామణి అవుతూ రూ. వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్స్, ప్రభుత్వ భూములు ఆక్రమించిన ముఖీం.. వీరందరికీ నేను హైడ్రా కమిషనర్ గా అడ్డు పడడటమే నేను చేసిన తప్పు. వీళ్ళు అందరూ వేసిన కేసులే నా మీద ఉన్న 63 కోర్ట్ ధిక్కార కేసులు. వాటిని నేను చట్ట పరంగానే ఎదుర్కుంటాను. నాకు న్యాయస్థానాలు అంటే పూర్తి నమ్మకం. చట్టాల పట్ల గౌరవంతో పని చేస్తూ వస్తున్నాను. గతంలో, ఇప్పుడు, మున్ముందు ప్రభుత్వాలు ఏ బాధ్యతలు అప్పగించినా నేను నా వైపు నుంచి 100 శాతం ఫలితాలు ఇవ్వటమే లక్ష్యంగా ఉంటాను. అలాగే పని చేస్తున్నాను, భవిష్యత్తులో కూడా అదు నిబద్ధతతో పని చేస్తాను.

## శ్రీరాములపల్లి బావి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి: కలెక్టర్‌కు వినతిపత్రం



**హన్మకొండ, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామంలో నెలకొన్న బావి సమస్యను తక్షణమే పరిష్కరించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ చిలువేరు ఓదమ్మ మోహన్, ఉపసర్పంచ్ గుర్రం దిలీప్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల ప్రతినిధులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజల తరపున సమర్పించిన వినతిపత్రంలో శ్రీరాములపల్లి గ్రామంలోని బావి సమస్య చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యంగా తాగునీటి అవసరాలతో పాటు దైనందిన వినియోగానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిలువేరు ఓదమ్మ మోహన్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, గ్రామానికి సంబంధించిన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం గ్రామ పంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామని, బావి సమస్యను కూడా అత్యవసరంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఉపసర్పంచ్ గుర్రం దిలీప్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారం సాధించే వరకు కృషి కొనసాగిస్తామని అన్నారు. బావి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తే గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యను పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు త్వరితగతిన స్పందించి బావి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

# హైడ్రాపై 'ఆక్రోషపు'అక్కసు !

మొదటి పేజీ తరువాయి

వల్ల మాత్రమే సాధ్యమైందని తెలుగు ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారన్నారు.దానం నాగేందర్ లాంటి ప్రముఖ రాజకీయ నేత నిర్మాణాన్ని కూల్చివేసిన సందర్భంలో విపరీతమైన రాజకీయ ఒత్తిల్లను ఎదుర్కొని తట్టుకొని నిలబడగలిగినారని గుర్తు చేశారు.హైదరాబాద్ ప్రాంతంలో హైదరాబాద్ అర్బన్, హైదరాబాద్ రూరల్, మున్సిపల్ శాఖలు 2008 నుండి 2023 వరకు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినారని వాటి పుణ్యమా అని వేల సంఖ్యలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు తెలిషాయన్న సంగతిని గుర్తుకు చేశారు.ప్రాక్టికల్ గా మాట్లాడడానికి ఫీల్డ్ మీద పనిచేయడానికి ఆకాశానికి భూమికున్నంత తేడా ఉంటుందని హైడ్రా కమీషనర్ ఏవి రంగనాథ్ ఫీల్డ్ మీద పనిచేయడానికి మాత్రమే తన శక్తి యుక్తిని తన పరిజ్ఞానాన్ని తన అధికార పదవిని తన పదునైన పనితనాన్ని ఉపయోగించారని అనేపద్యంలోనే హైదరాబాద్ నలుమూలల హైడ్రా చేస్తున్న గొప్ప పనుల వల్ల హైదరాబాద్ ప్రజలు పార్టీలకు అతీతంగా హైడ్రా పనితీరుకు బ్రహ్మరథం పడుతున్నారని హైదరాబాద్ ప్రాంతం పుట్టినది మొదలుకొని చెరువుల పునరుద్దారన పనులు ఇంత వేగంగా ఇంత నిజాయితీగా ఎప్పుడు జరగలేదని అది కేవలం హైడ్రా కమీషనర్ రంగనాథ్ పనితీరుతోనే సాధ్యమైందని అభినందించారు.హైడ్రా అనేది పదునైన కత్తి మీద సాము లాంటిదని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించడానికి ఐజి రంగనాథ్ ఐపీఎస్ ను ఎన్నిక చేసుకోవడంలోనే నూరుపాల్లుగా సఫలీకృతులైనారని నేటి వరకు హైడ్రా చేసిన గొప్ప కార్యక్రమాలను బట్టి ప్రభుత్వానికి అద్భుతమైన పేరు ప్రఖ్యాతలు వస్తున్నాయని తెలిపారు.

**న్యాయస్థాన తీర్పులను గౌరవించాలి..**

ఏ రాష్ట్రంలోనైనా న్యాయస్థానాలు వెలువరిస్తున్న తీర్పులను గౌరవించాల్సిన అవసరం ఉంటుందని అలాంటి సందర్భంలోనే హైడ్రా కమిషనర్ ఐజి ఏవి రంగనాథ్ ఐపీఎస్ అధికారుని హైడ్రా కమిషనర్ బాధ్యతలు నుండి తొలగించాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శికి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకింత నిరాశ భారంతో కూడిన చర్చ నడుస్తుందని పేర్కొన్నారు.వాస్తవాలను పరిశీలించగా హైదరాబాదులో హైడ్రా తాకిడికి ప్రైవేట్ భూకబ్జాదారులు సైతం భూములను కబ్జాలు పెట్టడానికి విపరీతంగా భయపడిపోతున్నారని అలాంటి భయానక వాతావరణాన్ని సృష్టించిన అధికారిగా రంగనాథ్ సంపూర్ణ విజయాన్ని సాధించగలిగినారని గర్వంగా తెలిపారు.ఏ ప్రభుత్వ కార్యాలయం పైనైనా మంచితో పాటు చెడు కూడా రుద్దడానికి సమాజంలో కొంతమంది ఎప్పుడు ప్రయత్నిస్తూనే ఉంటారని అలాంటి వాటిని ఎదుర్కొంటూ సాహసవంతమైన విధులు నిర్వహించడంలో ఉన్నత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని అలాంటి బాధ్యతాయుతమైన విధులు నిర్వహించిన ఉన్నతమైన అధికారులలో ఐజి ఏవి రంగనాథ్ మొదటి మూడు స్థానాలలో ప్రాముఖ్యమైన స్థానంలో నిలువగలరని ఆశాభావం వ్యక్తపరిచారు.కొన్ని సందర్భాలను లోతైన కోణంలో అధ్యయనం చేయాల్సి వచ్చినప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఇంట్లో కోట్ల రూపాయల 500 నోట్ల కట్టలు లభించాయని అవన్నీ మంటల్లో కాల్చివేయబడగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై కనీస చర్యలు చేపట్టకుండా దాటవేసిన సంఘటనను దేశ ప్రజలు చూశారన్న సంగతిని గుర్తు చేసుకోవాలన్నారు.చివరకు పార్లమెంటు సమావేశాల్లో చర్చలు జరిగే పరిస్థితి ఆ సుప్రీంకోర్టు న్యాయమూర్తి తలపెట్టిన ఘనకార్యం వల్ల ఏర్పడిందన్న సంగతిని ఎవరు మర్చిపోలేమన్నారు.తెలంగాణ హైకోర్టులోని ప్రధాన కేసులలో కింది కోర్టులు మంజూరు చేసిన ఉత్తర్వులను తప్పుపడుతూ పైకోర్టులు కిందికోర్టుల తీర్పులకు వ్యతిరేకమైన తీర్పులను ఉత్తర్వుల రూపంలో మంజూరు చేస్తున్నారని వాటి అన్నిటి వల్ల న్యాయస్థాన వ్యవస్థలు సమాజం పట్ల ఏ విధమైనటువంటి సాంకేతాలను ఇవ్వదలచిందో ప్రజలు లోతైన స్థాయిలో ఆలోచించి అర్థం చేసుకోవాలన్నారు. 2000 సంవత్సరం నుండి 2026 సంవత్సరాల వరకు సివిల్ తగాదాలకు సంబంధించిన కేసులలో జిల్లా న్యాయస్థానాలు మొదలుకొని ఉన్నత న్యాయస్థానాలు అత్యున్నత న్యాయస్థానాల వరకు భూకబ్జాదారుల ప్రభావం క్షేత్రస్థాయిలో కనిపిస్తుందని సామాన్యుల భూములను ప్రభుత్వ భూములను మాన్యం భూములను విశ్వవిద్యాలయాల భూములను చెరువు శిఖం భూములను నాల భూములను ఇలా చెప్పుకుంటూ పోతే ప్రైవేట్ భూములనే కాకుండా ప్రభుత్వ భూములను కబ్జాలు చేసే కరుడుగట్టిన భూకబ్జాదారులు ప్రధాన న్యాయవాదులను ఆశ్రయిస్తూ సంవత్సరాల కాలం పాటు న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ భూములు కబ్జాలు చేస్తూనే ఉన్నారని వాటికి సంబంధించిన కేసులు వేళల్లో లక్షలలో న్యాయస్థానాల్లో పేరుకుపోతున్నాయని గుర్తు చేశారు.ఒక ఉన్నత అధికారి అధికార కార్యక్రమాలను అడ్డగించడం కోసం అత్యంత శక్తివంతమైన న్యాయస్థానాన్ని ఉపయోగించడం ఎంతవరకు సమంజసమో న్యాయ నిపునులతో పాటు,తెలంగాణ మేధావులు ఆలోచించాలన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, చట్టాలు, న్యాయస్థానాలు చేయలేని పనిని ఒక హైడ్రా కమిషనర్ చేసి నిరూపిస్తున్నారు అంటే అతనిపై ప్రభుత్వం ఎంతటి విశ్వాసవంతమైన నమ్మకాన్ని పెట్టుకున్నారో ఉన్నత న్యాయస్థానం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రజల మద్దతు ఉన్నత స్థాయిలో పెరుగుతున్న సందర్భంలోనే ఐజి రంగనాథ్ ఐపీఎస్ చేస్తున్న ప్రభుత్వ సేవా కార్యక్రమాలకు ప్రభుత్వ ఆస్తుల రక్షణకు అడ్డుతెలుపాలని మొదటినుండి కుట్రలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు.హైడ్రా కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు అధికార పదవిని అడ్డం పెట్టుకొని వ్యక్తిగతంగా ఆస్తులను పోగు చేసుకున్నట్లయితే వాటిని ప్రశ్నించడంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు గాని ప్రైవేట్ కేసులలో ప్రభుత్వ కేసులలో పదుల సంఖ్యలో హైడ్రా కమిషనరేట్ కార్యాలయానికి న్యాయస్థానాల నుండి నోటీసులు పంపిస్తూ ప్రభుత్వ అభివృద్ధిని అడ్డుపడుతున్నారని హైదరాబాద్ ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు.అదే సందర్భంలో ప్రభుత్వ భూములు కబ్జాలు పెట్టి హైడ్రా పుణ్యమా అని భూములు నష్టపోతున్న బాధితులు హైడ్రాపై అకారణంగా కేసులు వేస్తున్నారని అలాంటి కేసుల విచారణలో భాగంగానే హైడ్రా కమిషనర్ ను న్యాయస్థానాల ముందు నిలబెట్టాల్సి వస్తుందని న్యాయనిపునులు ప్రైవేట్ కేసులు వేస్తున్న భూ బాధితులు పేర్కొంటున్నప్పటికిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమి రక్షించబడిందో ఎన్ని కోట్ల ఆదాయానికి సంబంధించిన భూములు హైడ్రా ఇప్పటివరకు రక్షించగలిగినారో వాటన్నిటిని సమతుల్యంగా పరిగణించాల్సిన ఉన్నత న్యాయస్థానం 50కి పైన కేసులలో హైడ్రా కమిషనర్ న్యాయస్థానానికి హాజరు కాలేదని దాని పర్యావస్థానం వల్లనే తనను పదవి నుంచి తొలగించాలంటూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం విచారకరమన్నారు.

**సమిష్టి పనిలో సమర్ధవంతునిపై నిందలు (వేటు)..!**

హైడ్రా అనేది ఒక ప్రభుత్వ సంస్థ అని అందులో రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ పోలీస్ న్యాయస్థానం లాంటి ప్రధాన సంస్థలు మిళితమై ఉంటాయని అవన్నీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తూ ప్రభుత్వ భూములను రక్షిస్తూనే చెరువుల పునరుద్దాలను కొనసాగిస్తున్నాయని అలాంటి పనితనానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని తెలిపారు.మరి ముఖ్యంగా ప్రభుత్వ న్యాయ సలహాదారులు ప్రభుత్వ న్యాయ నిపుణులు హైడ్రా కొనసాగిస్తున్న ప్రతి కేసును ఎప్పటికప్పుడు పర్యావేక్షిస్తూనే ఉన్నారని ప్రతి కేసుకు సంబంధించిన పూర్వపరాలు మొదలుకొని ప్రతి ఆధారాన్ని న్యాయస్థానాల్లో వేయబడుతున్న కేసులకు జవాబుదారీగా ప్రభుత్వ అధికారికంగా ఆధారాలు సమర్పించబడుతున్నాయని వాటన్నిటిని పరిగణలోనికి తీసుకోకుండా సమిష్టి పనికి కేవలం హైడ్రా కమిషనర్ రంగనాథ్ అనేకసార్లు న్యాయస్థానానికి రాలేదని తనను తొలగించాలంటూ ప్రభుత్వానికి తెలియజేయడం విచారకరమన్నారు.కేవలం ఒకే ఒక అధికారి తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ భూములను రక్షించడంలో విశ్వ ప్రభంజనం సృష్టిస్తూ ఉంటే వాటిని తట్టుకోలేని కొంతమంది అదృశ్య శక్తులు పైడ్రా కమిషనర్ పై వ్యక్తిగత కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఎంతో కష్టతరమైన పనిని చేపడుతూ ప్రభుత్వ భూముల తగాదాలను చెరువుల భూముల కబ్జాలను పరిష్కరిస్తూ ప్రజాస్వామ్యానికి లోబడి,హైడ్రా నియమాలకు లోబడి, ప్రభుత్వ నియమాలకు లోబడి, చట్టాలు న్యాయస్థానాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఎంతోకాలంగా చేయలేని పనులను అనాదికాలంలోనే చేసి నిరూపిస్తున్న హైడ్రా కమిషనర్ ను అవమానపరచడం పరిశీలిస్తుండగా కరుడుగట్టిన భూకబ్జాదారులకు,గరుడుగట్టిన అసాంఘిక శక్తులకు సహకరించడమేనన్నారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై ఉందని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కార మార్గానికి దారులు వేస్తూ హైడ్రా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రంగనాథ్ లాంటి పరిజ్ఞానవంతమైన అధికారిని దీర్ఘకాలికంగా కొనసాగిస్తూ ప్రభుత్వ భూముల రక్షణ వేటలో తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతుగా నిలవాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించగల అధికారులలో అన్ని ప్రభుత్వ శాఖలలోని ఉన్నతాధికారులను పరిగణలోనికి తీసుకోవలసి వచ్చినప్పుడు హైడ్రా కమీషనర్ రంగనాథ్ తో పాటు ప్రస్తుత తెలంగాణ డిజిపిగా పనిచేస్తున్న సివి ఆనంద్ ఐపీఎస్,మల్కాజిగిరి సిపి బదుగుల సుమతి మాత్రమే హైడ్రా బాధ్యతలకు సరితూగగలరని అంతటి నైపుణ్యతతో అంతటి సమర్థతతో అంతటి కఠినాత్మకమైన పనితనాన్ని ఎదుర్కొని నిలబడి పనిచేయడం సాధారణమైన విషయం కాదన్నారు.ఉన్నతమైన విమర్శలను ఎదుర్కొంటూ సమర్ధవంతమైన పనిచేసే క్రమంలో నిలువుటద్దం ముందు నిలబడి నిలువెత్తు బత్తిల్లను పట్టుకోవడమే అన్నారు. సునాయాసమైన పనులు నిర్వహించడానికే ఆయాస పడుతున్న నేటి తరపు ఉన్నతాధికారులు కష్టాన్ని ,కఠినత్వాన్ని, శ్రమను ఇబ్బందులను, అవమానాలను, మానసిక వేదనను, అణిచివేతలను, సూటిపోటి మాటలను, ప్రత్యక్ష విమర్శలను, పరోక్ష విమర్శలను, ఎదురొడ్డి ధైర్యంగా నిలబడి శక్తి వంచన లేకుండా పనిచేయగలగాలంటే అది ఎవరి తరం కాదని అలాంటి అరుదైన అధికారులు చాలా తక్కువ మంది ఉంటారని అలాంటి వాళ్లతో సమాజానికి పది తరాలపాటు మేలు జరుగుతుందన్న సంగతి ప్రతి ఒక్కరం గుర్తించాలన్నారు. అదును దొరికింది కదా అని రెచ్చిపోతూ హైడ్రా కమిషనర్ ఐజి ఏవి రంగనాథ్ పై పనికట్టుకొని విమర్శిస్తున్న విమర్శకులు భూకబ్జాదారులకు లంచగొండిలకు అవినీతిపరులకు అక్రమార్కులకు దళారీలకు వత్తాసుగా నిలబడుతున్నారని సంగతిని మర్చిపోకూడదని మరొక్కసారి హెచ్చరించారు.ఎవరి పనితనం ఏమిటో హైదరాబాద్ ప్రజలతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రజలు సంపూర్ణంగా అర్థం చేసుకోగల సమర్థవంతులని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న పైడ్రా ప్రభంజనం ఎంతగా విస్తరిస్తుందో ఎంతలా అభివృద్ధి పనులు చేపడుతుందో ప్రతి ఒక్కరు గమనించగలవారై ఉండాలన్నారు.




# నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

**ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు**

**వర్ధన్నపేట, జూలై 27 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండవతపురం గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇంటి వద్ద అమాయకంగా ఆడుకుంటున్న చిన్నారిని మాయమాటలతో తీసుకెళ్లిన భాస్కర్ (50) అనే వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత చిన్నారి ఇంటికి వచ్చాక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే బాలికను వైద్య పరీక్షల కోసం తరలించి, అనంతరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో నిందితుడు భాస్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం వెలుగులోకి రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిపైనే ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.




ఈ ఘటనపై వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు ను వివరణ కోరగా, నిందితుడు భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కస్టడీలో ఉంచినట్లు తెలిపారు. అతనిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ఎస్సై వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని కూడా పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో చిన్నారుల భద్రత, పాఠశాలల్లో పనిచేసే సిబ్బందిపై పర్యవేక్షణ, బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నేరెళ్ల బాధితులకు అండగా కల్వకుంట్ల కవిత





**రేపు బాధితులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ పరామర్శ 9 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న నేరెళ్ల బాధితులు**

**కరీంనగర్ జై భీమ్ న్యూస్**

నేరెళ్ల నెత్తుటి గాయం ఆ కుటుంబాలను వెంటాడుతోంది. 9 ఏళ్లుగా న్యాయం కోసం నేరెళ్ల బాధితులు ఎదురు చూస్తూనే ఉన్నారు. అప్పటి ప్రభుత్వంలోని ముఖ్యుల ఆగ్రహానికి గురై పోలీసుల దాష్టీకానికి బలైన 8 కుటుంబాలు ఈ రోజుకు నేరెళ్ల దురాగతాన్ని తలచుకొని వేదన చెందుతూనే ఉన్నారు. ఆ కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చేందుకు మంగళవారం నేరెళ్లలో పర్యటిస్తున్నారు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత. 2017లో పోలీసుల థర్డ్ డిగ్రీలో తీవ్రంగా గాయపడి 9 ఏళ్ల పాటు అనేక ఇబ్బందులు పడి ఇటీవల కన్నుమూసిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను కవిత మంగళవారం ఉదయం 10.30 గంటలకు పరామర్శిస్తారు.

**బాధితుల పోరాటానికి న్యాయ సహాయం**

నేరెళ్ల బాధితులను తమ రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకున్న రాజకీయ పార్టీలు వారిని ఆదుకోవడానికి మాత్రం ముందుకు రాలేదు. కొంతకాలం క్రితం నేరెళ్ల బాధితులు కల్వకుంట్ల కవితను కలిసి తమ గోడు చెప్పుకోగా వారికి అన్ని విధాల అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. వారి న్యాయపోరాటానికి సాయం అందించారు. నేరెళ్ల దురాగతంలో భాగస్వాములుగా ఉన్న వారికి న్యాయపరంగా శిక్ష పడే వరకు బాధితులకు వెన్నంటి ఉంటానని కవిత భరోసా ఇచ్చారు.

**నేరెళ్ల ఘటన**

మిడ్ మానేరు రిజర్వాయర్ లో ముంపునకు గురయ్యే మానేరు నదిలో ఇసుక తవ్వకాలకు 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) రాజ్యసభ సభ్యుడు సంతోష్ తండ్రి రవీందర్ రావు, ఇతర కుటుంబ సభ్యులు మానేరు నది నుంచి పెద్ద ఎత్తున ఇసుక తీసి లారీల్లో హైదరాబాద్ కు తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. ఇసుక తరలిస్తున్న లారీలతో సిరిసిల్ల ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. 2017 జూలై 2న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఇసుక లారీ ఢీకొని నేరెళ్లకు చెందిన రైతు బదనపు భూమయ్య చనిపోయారు. ఇసుక లారీ ఢీకొనడంతో భూమయ్య మరణించడాని ఆగ్రహించిన నేరెళ్ల గ్రామస్తులు నేరెళ్లలో ఇసుక లారీలను తగులబెట్టారు. ఈ ఘటనకు బాధ్యులుగా నేరెళ్ల గ్రామానికి చెందిన 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. బాధితులను కరీంనగర్ జైలుకు రిమాండ్ కోసం తరలించడంతో అప్పటి కరీంనగర్ జైలర్ శివకుమార్ వారిని జైలులో రిమాండ్ లో ఉంచడానికి నిరాకరించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. పోలీసులు నేరెళ్ల బాధితులకు పెయిన్ కిల్లర్స్ ఇచ్చి వాళ్లు ఆరోగ్యంగా ఉన్నట్టుగా డాక్టర్లతో సర్టిఫికెట్లు ఇప్పించి రిమాండ్ కు పంపారు. కరీంనగర్ జైలుకు తరలించిన తర్వాత 8 మంది బాధితుల్లో నలుగురు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.. అక్కడ డాక్టర్ల పరిశీలనలో థర్డ్ డిగ్రీ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల చిత్ర హింసల నుంచి బాధితులు ఇప్పటికీ కోలుకోలేదు. నేరెళ్ల బాధితుల్లో ఒకరైన గంధం గోపాల్ ఇటీవల మృతిచెందారు.. నేరెళ్ల మరో బాధితుడు పెంట బాణయ్య కిడ్నీల సమస్యతో బాధ పడుతున్నాడు. మిగతా బాధితులు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి - యువజన ఉద్యమ విజయమే: ఎఐడీఎస్ఓ







**ఎన్టీఏ రద్దు చేసి ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని డిమాండ్**

**వరంగల్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా సాగిన విద్యార్థి-యువజన ఉద్యమ విజయమని ఎఐడీఎస్ఓ (ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) వరంగల్ జిల్లా కమిటీ పేర్కొంది. ఎన్టీఏను రద్దు చేసి ప్రభుత్వ విద్యను పరిరక్షించే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరుతూ జూలై 27, 28 తేదీల్లో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రతిజ్ఞ ర్యాలీల్లో భాగంగా వరంగల్ ప్రభుత్వ వొకేషనల్ కళాశాల వద్ద సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐడీఎస్ఓ నాయకుడు బి. మధు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజలు ఐక్యంగా సాగించిన పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సంకల్పంతో పోరాడే విద్యార్థి-యువజన శక్తి ముందు ఎంతటి అధికార వ్యవస్థ అయినా తలవంచాల్సి వస్తుందని ఈ పరిణామం నిరూపించిందన్నారు. రాజీనామా సందర్భంగా నిరసనకారులను "దేశవ్యతిరేకులు"గా చిత్రీకరించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్యపై కార్పొరేట్ అనుకూల విధానాల ప్రభావమే ఈ ఉద్యమానికి కారణమని తెలిపారు. ఇటువంటి విధానాలు ప్రభుత్వ విద్యను బలహీనపరచడంతో పాటు నిరుద్యోగాన్ని పెంచి, సామాజిక విలువలకు కూడా నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. ఉద్యమాల సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసుల దాడులు, మహిళా నిరసనకారుల పట్ల జరిగిన దుర్వ్యవహారంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన అన్ని కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఏ రద్దు, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020) ఉపసంహరణ కోసం పోరాటాన్ని మరింత విస్తరించాలని ఎఐడీఎస్ఓ పిలుపునిచ్చింది. ప్రభుత్వ విద్యను రక్షించేందుకు దేశంలోని విద్యార్థి సంఘాలు, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేసింది.

# కమలాపూర్‌లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక వైద్య శిబిరాలు

**హన్మకొండ, 27 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కమలాపూర్, కానిపర్తి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామాల సర్పంచులు పబ్బు సతీష్, కోడిగుటి చేరాలు శిబిరాలను ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ రోహిత్, డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మొత్తం 192 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న 8 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల నిర్ధారణ కోసం పరీక్షలకు పంపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీలు, ఉప సర్పంచ్‌లు, హెచ్‌ఈఓ రవీందర్, ఏఎన్ఎంలు శశికళ, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, బాబు, రాము, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# న్యాయస్థానాల్లో నకిలీ న్యాయవాదులు !

**న్యూ ఢిల్లీ జై భీమ్ న్యూస్:-**

భారత ప్రధాన న్యాయమూర్తే స్వయంగా దేశంలో 48 వేల మంది నకిలీ అడ్వకేట్లు ఉన్నారని చెబితే, అది ఒక ప్రకటన కాదు - అది ఈ దేశ న్యాయవ్యవస్థ పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందనడానికి సాక్ష్యం. ఇది చిన్న తప్పిదం కాదు, జాతీయ స్థాయిలో జరిగిన వ్యవస్థాగత నేరం. నకిలీ డిగ్రీలతో, దొంగ సర్టిఫికెట్లతో వేలాది మంది కోర్టుల్లో తిరుగుతూ, నల్లకోటు వేసుకుని వాదనలు వినిపిస్తూ, ప్రజల జీవితాలను, ఆస్తులను, స్వేచ్ఛను నిర్ణయించే కేసులను నడిపిస్తుంటే - ఇన్నాళ్లూ న్యాయవ్యవస్థ ఏం చేస్తోంది? బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏం చేస్తోంది? సుప్రీంకోర్టు కళ్ళు మూసుకుందా? 48 మంది కాదు, 480 మంది కాదు... 48 వేల మంది! ఇది పొరపాటున దూరిన సంఖ్య కాదు, దశాబ్దాలుగా వ్యవస్థలో పేరుకుపోయిన కుళ్లు.

**ఈ నకిలీల వల్ల జరిగిన విధ్వంసం ఏమిటి?**

ప్రజలకు అన్యాయమే న్యాయంగా చెలామణి అయింది: న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కిన అమాయకుడు తన కేసును ఒక దొంగ చేతిలో పెట్టాడు. తీర్పు రాకముందే వాడి జీవితం నాశనమైంది. న్యాయవ్యవస్థ మీద నమ్మకం బద్దలైంది: కోర్టులో నిలబడ్డవాడు నిజమైన లాయరా, నకిలీయా అని ప్రజలు అనుమానించాల్సిన దుస్థితి వచ్చింది. న్యాయవాద వృత్తి పరువు బజారుకీడ్చబడింది: కష్టపడి లా చదివి, నిజాయితీగా వృత్తిని నమ్ముకున్న లక్షలాది మంది యువ న్యాయవాదుల చెమటను ఈ నకిలీ గ్యాంగ్ అపహాస్యం చేసింది. బాధ్యత ఎవరిది? బార్ కౌన్సిల్ మీదకు నెట్టేసి తప్పించుకుంటారా? బార్ కౌన్సిల్ వైఫల్యం అని చెప్పి సుప్రీంకోర్టు చేతులు దులుపుకోలేదు. బార్ కౌన్సిల్ కు మొగుడు ఎవరు? న్యాయవ్యవస్థే కదా! దానిని నియంత్రించాల్సింది, ప్రక్షాళన చేయాల్సింది న్యాయవ్యవస్థే కదా! ఇంతమంది నకిలీలు ఎలా వచ్చారు? వారి వెరిఫికేషన్ ఎందుకు జరగలేదు? వారి లైసెన్సులు ఇప్పటివరకు ఎందుకు రద్దు కాలేదు? వారిపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదు? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. ఎందుకంటే అక్కడ చిత్తశుద్ధి లేదు. కాక్రోచ్ వ్యాఖ్యల నుండి కప్పదాటు ఎందుకు? అసలు 48 వేల నకిలీలను కాక్రోచ్ అన్నాను అని చెప్పి, ఇప్పుడు విద్యార్థులను, యువతను అనలేదని మాట మార్చడం ఏమిటి? కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి పడగానే మాట మార్చేస్తారా? దేశ యువత ప్రశ్నిస్తే పూటకో మాట మారుస్తారా? ప్రజలు అంత అమాయకులు కారు. మీరు ఎవరినీ వదిలేయరు, ప్రజలు మిమ్మల్ని అంత తేలికగా వదిలేయరు. కావాల్సింది ప్రసంగాలు కాదు, ప్రక్షాళన! వేదికల మీద ఆవేదన వ్యక్తం చేస్తే సరిపోదు. మీకు చేతనైతే చేసి చూపించండి.

**తక్షణం చేయాల్సిన చర్యలు ఇవే:**

1. దేశవ్యాప్త డిజిటల్ ప్రక్షాళన: ప్రతి ఒక్క అడ్వకేట్ డిగ్రీని యూనివర్సిటీలతో, ఆధార్ తో లింక్ చేసి వెరిఫై చేయాలి.

2. క్యూఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ ఐడి: ప్రతి లాయర్ కు క్యూఆర్ కోడ్ తో కూడిన యూనిక్ ఐడి ఇవ్వాలి. ప్రజలు స్కాన్ చేస్తే వాడు అసలో నకిలీయో తెలిసిపోవాలి.

3. బార్ కౌన్సిళ్ల ఆడిట్: అవినీతి అడ్డాగా మారిన బార్ కౌన్సిళ్లపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక ఆడిట్ జరగాలి.

4. క్రిమినల్ చర్యలు: నకిలీ సర్టిఫికెట్ తో ప్రాక్టీస్ చేసిన ప్రతి ఒక్కడిపై చీటింగ్, ఫోర్జరీ కేసులు పెట్టి జైలుకు పంపాలి.

న్యాయం చెప్పే గద్దె మీద కూర్చున్నప్పుడు, మీ ఇంటిని మీరే శుభ్రం చేసుకోలేకపోతే, దేశానికి మీరు ఏం న్యాయం చెబుతారు? ఇది బార్ కౌన్సిల్ వైఫల్యం మాత్రమే కాదు, దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ పర్యవేక్షణ వైఫల్యం. ఈ కుళ్లిన వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించకపోతే, ప్రజల్లో న్యాయవ్యవస్థపై ఉన్న చివరి నమ్మకం కూడా ఆవిరైపోతుంది.

# సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

**కల్పలత సూపర్ బజార్ సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హన్మకొండ, 27 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ నగరంలోని రంగంపేటలో ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, నిత్యావసర సరుకుల లభ్యత, వస్తువుల నాణ్యత, నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేసి ఇంధన విక్రయాలు, నిల్వలు, రోజువారీ లావాదేవీలు, నిర్వహణ తీరుపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. తదుపరి సూపర్ బజార్‌లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరల విక్రయాలు, నాణ్యత, నిల్వలపై ఆరా తీశారు. స్థానిక చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ-వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాలు పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, సభ్యులతో పాటు సాధారణ వినియోగదారులకు కూడా నాణ్యమైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి బి. మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి, ఆడిట్ అధికారి కోదండరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# రూ.1.12 కోట్లతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

**ప్రజాపాలనలో అభివృద్ధిని ప్రజలే బేరీజు వేసుకోవాలి**
**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**వరంగల్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 31వ డివిజన్ పరిధిలోని శాయంపేట చౌరస్తా, వాసవి కాలనీలో సుమారు రూ.1.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాపాలనలో పట్టణం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలు స్వయంగా బేరీజు వేసుకోవాలని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను గత పరిస్థితులతో పోల్చి చూడాలని సూచించారు. గతంలో అనేక కాలనీలు రోడ్లు, డ్రైనేజీలు వంటి కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని ప్రతి గల్లీకి, ప్రతి కాలనీకి తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. స్లమ్ ప్రాంతాలు, ఎస్సీ కాలనీలు, వెనుకబడిన ప్రాంతాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కాజీపేట, సోమిడి, గోపాలపురం, శాయంపేట, దీన్‌దయాళ్ నగర్, సమ్మయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజలు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా, ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా అభివృద్ధి విషయంలో అందరూ సమానమేనని స్పష్టం చేశారు. ప్రతి వార్డు, ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. గతంలో స్మార్ట్ సిటీ నిధులు పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం వల్ల వరంగల్ అభివృద్ధికి నష్టం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాకాలం వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ నిధులు సమీకరించి అభివృద్ధి పనులు కొనసాగించడం సవాలుతో కూడుకున్నదేనని, అయినప్పటికీ ప్రజల అవసరాల దృష్ట్యా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీవాసులు, అభిమానులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్, వంగపాడులో బెల్ట్ షాపులపై హసన్‌పర్తి పోలీసుల మెరుపు దాడులు

**హసన్‌పర్తి, 27 జూలై 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మండల పరిధిలోని సిద్ధాపూర్, వంగపాడు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై హసన్‌పర్తి పోలీసులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, సిద్ధాపూర్, వంగపాడు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో దాడులు చేపట్టారు. తనిఖీల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తాబేటి యుగేందర్, ముస్కు శ్రీనాథ్, ముస్కు నరసింహులు అనే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ ఈఈఈ విభాగాధిపతిగా డాక్టర్ కె. సుమలత నియామకం

**కేయూ క్యాంపస్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగాధిపతిగా డాక్టర్ కె. సుమలతను రెండేళ్ల కాలానికి నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ టి. జగన్ మోహన్ రాజు నుంచి డాక్టర్ కె. సుమలత త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. డాక్టర్ కె. సుమలత విశ్వవిద్యాలయంలో పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా, హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా, హాస్టల్ డైరెక్టర్‌గా పలు కీలక పరిపాలనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 20కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించి విద్యా, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. ఈ నియామకం సందర్భంగా విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ కె. సుమలతను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# వరంగల్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్న

**న్యూఢిల్లీ, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై సమగ్ర వివరాలను కోరారు. గత కొంతకాలంగా వరంగల్‌లో ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల విస్తరణ అంశాలను పార్లమెంట్‌లో నిరంతరం ప్రస్తావిస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఈసారి డిజిటల్ విద్యా మౌలిక వసతులపై ప్రత్యేకంగా కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన అభివృద్ధి పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను కోరారు. ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈ-విద్య, దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల ఆధారంగా కేంద్రం ఆర్థిక సహాయం అందజేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో డిజిటల్ విద్యా వసతుల అభివృద్ధికి గత ఐదేళ్లుగా కేంద్రం గణనీయమైన మద్దతు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2025--26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకోసం రూ.108.98 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సమాధానంలో పేర్కొంది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల అభివృద్ధికి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు కృషి కొనసాగిస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే డిజిటల్ వసతులు, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత అవసరమని పేర్కొన్న ఎంపీ, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి పెట్టాలి





**ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ఎనగందుల వరదా రెడ్డి**
**నాలుగేళ్లే జీవితానికి బంగారు బాట... అవకాశాలను అందిపుచ్చుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోండి**
**ఎస్ఆర్ యూనివర్సిటీలో తొలి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం - 5 వేల మందితో ఓరియంటేషన్ కార్యక్రమం**

**హన్మకొండ జిల్లా/హసన్ పర్తి, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థి జీవితంలో యూనివర్సిటీలో గడిపే నాలుగేళ్లు భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన దశ అని, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఎనగందుల వరదా రెడ్డి అన్నారు. వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో 2026--27 విద్యా సంవత్సరానికి నూతనంగా చేరిన తొలి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ సోమవారం ఘనంగా నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల ఉన్నత విద్యా ప్రయాణానికి నాంది పలికిన ఈ కార్యక్రమంలో 5 వేల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విశేష స్పందన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు, ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. మహేష్, డీన్--ఆపరేషన్స్ అండ్ గ్రోత్ ప్రొఫెసర్ ఆర్. అర్చనా రెడ్డి, డీన్--అకడమిక్స్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్‌తో పాటు పలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలతో పాటు దేశంలోని 20కి పైగా రాష్ట్రాలు, పలు విదేశాలకు చెందిన విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో యూనివర్సిటీలో చేరడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఛాన్సలర్ ఎనగందుల వరదా రెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీలో చేరడం అనేది విద్యార్థుల జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లేనని అన్నారు. ఈ నాలుగేళ్లలో విద్యార్థులు కేవలం డిగ్రీ సాధించడానికే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన విధానం, వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, క్రమబద్ధతను అలవర్చుకుని విద్యతో పాటు సహపాఠ్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొంటూ, వారిని గౌరవిస్తూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడుపుతూ స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించాలని, విద్యార్థుల సంక్షేమం, భద్రత, నాణ్యమైన విద్య అందించడంలో యూనివర్సిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, యూనివర్సిటీ అనేది కేవలం తరగతి గదులకు మాత్రమే పరిమితం కాదని, ఆవిష్కరణలు, పరిశోధనలు, కొత్త ఆలోచనలకు వేదిక అని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుని, అధ్యాపకులతో నిరంతరం చర్చలు జరుపుతూ పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. సౌకర్యాల పరిధిని దాటి కొత్త అవకాశాలను అన్వేషించే విద్యార్థులే భవిష్యత్తులో విజయవంతమైన నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. మహేష్ మాట్లాడుతూ, ఎస్ఆర్ యూనివర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందుతోందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్--2025 ఇంజినీరింగ్ ర్యాంకింగ్స్‌లో దేశంలోని టాప్--100 ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో 91వ స్థానం, ది వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ --2026లో ప్రపంచవ్యాప్తంగా 801--1000 బ్యాండ్‌లో, భారతదేశంలో 28వ స్థానం, యూఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ --2025లో ప్రపంచవ్యాప్తంగా 585వ స్థానం సాధించడం యూనివర్సిటీ నాణ్యతకు నిదర్శనమని తెలిపారు. బి.ఎస్సి. (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు లభించడంతో పాటు ఎస్ఆర్ఐఎక్స్ ద్వారా 170కి పైగా స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించిన విషయాన్ని వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత, సంక్షేమం, నాణ్యమైన విద్యకు యూనివర్సిటీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ర్యాగింగ్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన క్యాంపస్ వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, హాస్టల్ సదుపాయాలు, క్రీడా మైదానాలు, వెల్‌నెస్ సెంటర్లు, మెంటరింగ్, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డీన్--ఆపరేషన్స్ అండ్ గ్రోత్ ప్రొఫెసర్ ఆర్. అర్చనా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రపంచస్థాయి కెరీర్ అవకాశాలు కల్పించడమే యూనివర్సిటీ లక్ష్యమన్నారు. 2026లో పట్టభద్రులైన విద్యార్థులకు 1,530 ప్లేస్‌మెంట్ ఆఫర్లు లభించగా, అమెజాన్ సంస్థలో అత్యధికంగా ?44 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించిందని తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో 100 శాతం ప్లేస్‌మెంట్లు నమోదయ్యాయని, 2027లో పట్టభద్రులయ్యే విద్యార్థులు ఇప్పటికే సర్వీస్ నౌ, అగోడా వంటి అంతర్జాతీయ సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు సాధించి నెలకు ?89 వేల వరకు స్టైపెండ్ పొందుతున్నారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ ట్రైనింగ్, ఇండస్ట్రీ సర్టిఫికేషన్లు, మాక్ ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను సమగ్రంగా ప్లేస్‌మెంట్లకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమం ముగింపులో డీన్--అకడమిక్స్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్ జూలై 28 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఇండక్షన్ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించి అత్యాధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, పరిశోధనా కేంద్రాలు, క్రీడా సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన నైపుణ్యాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వం లక్ష్యాలుగా నిర్వహించిన ఈ ఓరియంటేషన్ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, యూనివర్సిటీ మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ స్ఫూర్తిదాయక వాతావరణంలో ముగిసింది.



# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కేసీఆర్





### "ఏం చేస్తారో చేయండి.. మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ వైద్యులకు విజ్ఞప్తి

**సికింద్రాబాద్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తీవ్ర అస్వస్థతతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సోమవారం యశోద ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులను కలిసి చికిత్స వివరాలు తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డిని పరిశీలించిన కేసీఆర్, వైద్య బృందంతో దాదాపు అరగంటపాటు చికిత్స విధానం, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యమ సహచరుడిని ఆ పరిస్థితిలో చూసి భావోద్వేగానికి లోనయ్యారు. వైద్యులు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, ఇతర అవయవాలు సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ మెదడు పూర్తిగా స్పందించేందుకు మరికొంత సమయం అవసరమని, ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన అంచనా చెప్పేందుకు మరో 48 గంటలు పట్టే అవకాశం ఉందని వివరించారు. వైద్యుల వివరాలు విన్న అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ, "ఏం చేస్తారో చేయండి... మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ వైద్యులకు చేతులెత్తి నమస్కరించి విజ్ఞప్తి చేశారు. చికిత్స ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదని, అవసరమైన అన్ని సహాయాలను పార్టీ తరఫున అందిస్తామని స్పష్టం చేశారు. ఆ తర్వాత పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్టతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్, వైద్యుల కృషి, దేవుని దయ, ప్రజల ఆశీర్వాదంతో ఆయన త్వరగా కోలుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆందోళన చెందవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు, జేఎస్ రావు మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని, ఎంఆర్ఐ సహా అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక






### పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాం: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 27:జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఎఎస్) ప్రవేశాలకు సంబంధించిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో డ్రా విధానం ద్వారా పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పక్షపాత ధోరణితో డ్రా నిర్వహించి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వివరాల ప్రకారం, 5వ తరగతిలో మొత్తం 62 సీట్లు అందుబాటులో ఉండగా మొదటి విడతలో 52 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో మిగిలిన 10 సీట్ల భర్తీ కోసం రెండో విడతలో 17 దరఖాస్తులు స్వీకరించారు. ఈ 10 సీట్లకు 17 మంది అర్హులు ఉండటంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రా నిర్వహించి 10 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మిగిలిన ఏడుగురిని వెయిటింగ్ లిస్టులో ప్రాధాన్యత క్రమంలో ఉంచారు. డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులు శివాని స్కూల్ (నర్సంపేట), ఏవిఎస్ స్కూల్ (ధర్మారం), వందన స్కూల్ (వరంగల్), విద్యోదయ స్కూల్ (నెక్కొండ) తదితర విద్యాసంస్థలను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.సి.డి.ఓ (ఎస్ఎసి) పుష్పలత, జిల్లా సంక్షేమ అధికారి (డీసీఓ) సరిత, అకాడెమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

### వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు తెలంగాణ గౌడ యువజన సంఘం వినతి

**వరంగల్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ యువజన సంఘం (టీజీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గట్టు నరేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ బహుజనుల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు. ఆయన చరిత్ర, త్యాగాలు, స్వరాజ్య స్థాపన కోసం చేసిన పోరాటాలను నేటి తరాలకు తెలియజేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 18న నిర్వహించే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ప్రజల్లో చారిత్రక అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిల్లో జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించి, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాలు, బహుజన సంఘాల ప్రతినిధులు, యువత, ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను కోరినట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు ముందస్తు ఆదేశాలు జారీ చేసి అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులను అధికారికంగా ఆహ్వానించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చరిత్ర, ఆయన చేసిన వీరోచిత పోరాటాలు, బహుజన సమాజానికి అందించిన స్ఫూర్తిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బండారి జనార్దన్ గౌడ్, చిర్ర సుమన్ గౌడ్, నాగపూరి వెంకటేష్ గౌడ్, నరేష్ గౌడ్ తదితర గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ప్రజలకు మర్యాదపూర్వక సేవలే పోలీసుల ప్రధాన బాధ్యత: పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

### హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీపీ




**హసన్‌పర్తి, 27 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం సెంట్రల్ జోన్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ ఆవరణ, మౌలిక సదుపాయాలు, పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ పరిధిలో తరచూ నమోదవుతున్న నేరాల వివరాలు, గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణపై ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన ఆమె, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు పై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, చోరీల నివారణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. నమోదైన ప్రతి కేసును నిష్పక్షపాతంగా, నాణ్యమైన దర్యాప్తుతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం

## - చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### సమాచారం అందించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం - డీఎంహెచ్‌వో డా. ఏ. అప్పయ్య

**హన్మకొండ, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

లింగ వివక్షతను నిర్మూలించి, బాలికల జననాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం (పీసీ అండ్ పి.ఎన్.డీ.టీ యాక్ట్) అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) నివేదిక ఆధారంగా జిల్లాలో తగ్గుతున్న బాలికల జనన నిష్పత్తి, స్కానింగ్ సెంటర్ల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్ల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి కమిటీ సభ్యుల సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, ఆడశిశువు అని తెలిసి గర్భస్రావానికి పాల్పడడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మూడు స్కానింగ్ యంత్రాలను స్వాధీనం (సీజ్) చేసామని తెలిపారు. ఎక్కడైనా మొబైల్ స్కానింగ్ యంత్రాలు వినియోగిస్తున్నా లేదా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం ఉంటే 63000 30940 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, లింగ నిర్ధారణకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అందించి అక్రమాలను వెలికితీసేందుకు సహకరించిన వారికి రూ.50,000 ప్రోత్సాహక బహుమతి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఇప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడపిల్లలను కలిగిన కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించి, లింగ వివక్షతపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో మాత్రమే నిర్దిష్ట పరిస్థితుల్లో చట్టబద్ధంగా గర్భస్రావానికి అవకాశం ఉంటుందని, అయితే పుట్టబోయే శిశువు ఆడపిల్ల అని తెలుసుకుని గర్భస్రావానికి పాల్పడటం నేరమని వైద్యులు వివరించారు. నాటు వైద్యం, స్వయంగా మందులు వాడటం లేదా అర్హతలేని వ్యక్తుల వద్ద చికిత్స చేయించుకోవడం వల్ల ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీఎంహెచ్ గైనకాలజిస్టు ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, పరకాల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, గైనకాలజిస్టులు డాక్టర్ కవిత, డాక్టర్ రూబీనా, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాళ్లూరి లత, డాన్ బోస్కో సంస్థ ప్రతినిధి ఈ. రాజు, పి. శారద, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# 29న శాకంభరీ విశ్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్న భద్రకాళి అమ్మవారు




**వరంగల్, 27 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

చారిత్రక ఏకశిలానగరమైన హనుమకొండలోని శ్రీ భద్రకాళీ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు సోమవారం పదమూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాల అనంతరం తిథి మండల దేవతా యజ్ఞంలో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తులను మాత్రా, సర్వమంగళా స్వరూపాలలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ, దశమహావిద్యలలో ఆద్యవిద్య అయిన కాళీ ఉపాసనలో త్రయోదశి తిథికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. సమస్త జీవరాశులకు ఆధారశక్తిగా అమ్మవారు వ్యాపించి ఉన్నారని, మాత్రా సర్వమంగళా రూపంలో భక్తులకు సర్వమంగళాలు, శుభఫలితాలు ప్రసాదిస్తారని తెలిపారు. ఈ నెల 29వ తేదీ బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి అమ్మవారికి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో శాకంభరీ అలంకరణ ప్రారంభమవుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల వరకు అలంకరణ కొనసాగనున్నందున ఆ సమయంలో భక్తులకు దర్శనం ఉండదని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక పూజల తర్వాత ఉదయం 9 గంటల నుంచి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తుల కోసం సర్వదర్శనం, విశిష్ట దర్శనం, అతి శీఘ్ర దర్శనం, ధర్మ దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదే రోజు ఉదయం 11 గంటలకు వ్యాసపూజ, మహాపూర్ణాహుతి, బలిప్రదానం, అవభృథ స్నానంతో శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు ముగియనున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, హరనాథ్‌లు మట్టేవాడ సీఐ కరుణాకర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సునీత దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ వెంకన్న, టూరిజం అధికారి శివాజీ, తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'శ్రీనివాస మంగాపురం' చిత్రం హీరో గట్టమనేని జైకృష్ణ, దర్శకుడు అజయ్ భూపతి, చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు.

# మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన కీహోల్ సర్జరీ ద్వారా కిడ్నీ క్యాన్సర్‌కు విజయవంతమైన చికిత్స





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

రీనల్ సెల్ కార్సినోమాతో సహా పలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 48 ఏళ్ల మహిళకు, కర్ణాటక రాష్ట్రం బెంగ ళూరులోని వైట్ ఫీల్డ్ మెడికవర్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యుల బృందం అధునాతన మినిమల్లీ ఇన్వాసివ్ రాడికల్ నెఫ్రెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, పేషంట్ కి పునర్జన్మను ప్రసాదించింది. ఆ రోగి గత కొన్ని నెలలుగా దీర్ఘకాలిక హెమటూరియా (మూత్రంలో రక్తం), మెడలో గడ్డ, అధిక రక్తపోటు, తీవ్రమైన రక్తహీనత మరియు కడుపునొప్పితో బాధపడుతున్నారు. పరీక్షల సమయంలో, ఎడమ కిడ్నీలో 7 సెం.మీ. కణితిని గుర్తించారు, అది రీనల్ సెల్ కార్సినోమా (కిడ్నీ క్యాన్సర్) అని నిర్ధారించారు. దీనితో పాటు, డైలేటెడ్ కార్డియోమయోపతి, కుడి వైపు థైరాయిడ్ కణితి మరియు గర్భాశయ అడెనోమయోసిస్ కూడా ఉన్నట్లు కనుగొన్నారు. మొదటి దశలో, రోగి యొక్క రక్తపోటు, రక్తహీనత మరియు గుండె పరిస్థితిని నియంత్రించి చికిత్స అందించారు. ఆ తర్వాత, కార్డియాలజిస్టులతో సహా వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో, డాక్టర్ ప్రమోద్ ఎస్., డాక్టర్ టి జె ప్రదీప్ కుమార్ గారి నాయకత్వంలో అత్యాధునిక కీహోల్ టెక్నాలజీని ఉపయోగించి కిడ్నీని విజయవంతంగా తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం, రోగి ఆరోగ్యం బాగా కోలుకుంది మరియు ఎటువంటి తీవ్రమైన సమస్యలు లేకుండా ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు అని తెలిపారు. ఈ విషయంపై రోగి పద్మజ మాట్లాడుతూ, "ఈరోజు మెడికవర్ వైద్యులు నా ప్రాణాలను కాపాడారు, అందుకే నేను, నా కుటుంబం మీ విలేకరుల ముందుకు వచ్చాము. మేము ఆసుపత్రికి వచ్చినప్పుడు చాలా భయపడ్డాము, ఆర్థికంగా కూడా అంత బలంగా లేము. కానీ బెంగళూరు వైట్ ఫీల్డ్ మెడికవర్ వైద్యుల బృందం మరియు యాజమాన్యం ఇచ్చిన హామీని అంగీకరించి, చికిత్స తీసుకుని ఈరోజు మీ ముందుకు వచ్చాము" అని తన హృదయాన్ని కలచివేస్తూ మాట్లాడారు. ఈ విషయంపై యూరాలజిస్ట్ మరియు రోబోటిక్ సర్జన్ అయిన డాక్టర్ ప్రమోద్ ఎస్. మాట్లాడుతూ, "మూత్రంలో రక్తం, వీపు లేదా పొత్తికడుపులో నిరంతర నొప్పి, మరియు కారణం తెలియని బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే, అధునాతన కీహోల్ లేదా రోబోటిక్ సర్జరీ ద్వారా సురక్షితంగా చికిత్స చేసి మంచి ఫలితాలు పొందవచ్చు," అని అన్నారు. మెడికవర్ హాస్పిటల్ అధిపతి అయిన సిద్ధారెడ్డి మాట్లాడుతూ, తమ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన నిపుణుల బృందం మరియు బహుళ విభాగాల చికిత్సా విధానం ద్వారా, క్లిష్టమైన కిడ్నీ క్యాన్సర్ కేసులకు కూడా సమగ్రమైన మరియు సమర్థవంతమైన చికిత్సను మెడికవర్ హాస్పిటల్ విజయవంతంగా అందిస్తోందని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు,కడియం శ్రీహరి**



**ధర్మసాగర్ : (జై భీమ్ న్యూస్)**

రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుండి నీటిని స్థానిక స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి విడుదల చేశారు. ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకు రిజర్వాయర్ ద్వారా పరవళ్లు తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు పసుపు, కుంకుమలు, పుష్పాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్పర్తి,ఐనవోలు,వర్ధన్నపేట మండలాల పరిధిలోని రైతుల పంట పొలాలకు నీళ్లు అందించడం కోసం సౌత్ కెనాల్ గేట్లను ఎత్తి కాల్వల ద్వారా జలాలను విడుదల చేశామన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని రైతులకు నీళ్లు వస్తాయని వర్షాలు సమృద్ధిగా పడితే నిరంతరం నీళ్లు వస్తూనే ఉంటాయని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ నీటి నిలువలతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్య కొంత మేరకు సమస్య పరిష్కారం కానుందని పేర్కొన్నారు.ఇప్పుడు కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ప్రజలకు,రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు,మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్,45 డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి,44వ డివిజన్ అధ్యక్షులు సదానందం,46వ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్,ఐనవోలు సర్పంచుల ఫోరం అధ్యక్షులు శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,రాకేష్ రెడ్డి,దువ్వ నవీన్,సదానందం,నియోజకవర్గాల, డివిజన్,మండల, గ్రామ ముఖ్య నాయకులు, సర్పంచులు,కార్యకర్తలు,రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం.. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు

**వర్ధన్నపేట, జూలై 27 । జై భీమ్ న్యూస్**



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండవతపురం గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇంటి వద్ద అమాయకంగా ఆడుకుంటున్న చిన్నారిని మాయమాటలతో తీసుకెళ్లిన భాస్కర్ (50) అనే వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత చిన్నారి ఇంటికి వచ్చాక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే బాలికను వైద్య పరీక్షల కోసం తరలించి, అనంతరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో నిందితుడు భాస్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం వెలుగులోకి రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిపైనే ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు ను వివరణ కోరగా, నిందితుడు భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కస్టడీలో ఉంచినట్లు తెలిపారు. అతనిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ఎస్సై వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని కూడా పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో చిన్నారుల భద్రత, పాఠశాలల్లో పనిచేసే సిబ్బందిపై పర్యవేక్షణ, బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# లైసెన్సు లేని సామల్ల బంగారం దందా

**జీరో వ్యాపారంతో ఖజానాకు గండి**
**నిఘా అధికారుల కళ్లకు గంతలు**
**దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే**




**వరంగల్ : (జై భీమ్ న్యూస్)**

బంగారాన్ని అక్రమ మార్గాల్లో విక్రయించేవారు పెరిగిపోయారు. కొందరు ప్రభుత్వానికి సుంకం చెల్లించకుండా జీరో వ్యాపారం ద్వారా ప్రభుత్వ ఖనాజాకు గండి కొడుతున్నారు.హైదరాబాద్ నుండి రూ.కోట్ల విలువైన బంగారం వరంగల్ కు చేరుతుంది. దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే.హైదరాబాద్ నుండి బిల్లులు లేకుండా బంగారం తరలిస్తున్న వరంగల్లోని కరీంబాద్ కు చెందిన సామర్ల రాజు కొత్త అవతారంతో దర్జాగా లైసెన్సు లేకుండా కొరియర్ లో బంగారాన్ని సరఫరా చేస్తున్నాడు. సికింద్రాబాద్ నుండి వరంగల్ కు శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులో బిల్లులు లేకుండా ఏదేచ్ఛగా బంగారం అభరణాల సరఫరా చేస్తున్నాడు. లైసెన్స్ లేకుండా కిలోల కొద్దీ బంగారాన్ని సరఫరా చేస్తున్నాడు. వరంగల్,ఖాజీపేట రైల్వే పోలీసుల సహకారంతో నడిపిస్తున్నారు.అధికారులకు తెలిసిన అందినకాడికి దండుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఇదే అదునుగా వ్యాపారులు రెచ్చిపోతున్నారు సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ యాడ్ తదితర పనులు చెల్లించకుండానే భారీగా బంగారం దిగుమతి చేసుకుంటూ జీరో వ్యాపారం సాగిస్తున్నారు ఎలాంటి బిల్లులు లేకుండా చేసే వ్యాపారంలో లావాదేవీలు జిల్లాలో నిత్యం లక్షల్లో మేర జరుగుతున్నట్లు తెలిసింది ఈ క్రమంలో ప్రభుత్వ ఖజానాకు రోజుకు 50 లక్షల మీద గండి పడుతుంది.వినియోగదారులకు నష్టం కలుగుతుంది.జీఎస్టీ బిల్లు లేకపోవడం వల్ల భవిష్యత్తులో ఆ బంగారాన్ని తిరిగి అమ్మాలన్నా, స్వచ్ఛత తూకంపై వివాదాలు వచ్చినా వినియోగదారులు న్యాయపరంగా నిరూపించుకోవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైసెన్సు లేని సామల్ల బంగారం దందాను అరికట్టాలని కోరుతున్నారు.

# ప్రజారోగ్యమే ప్రాధాన్యం...

**సోమారంలో సర్పంచ్ శ్రీనివాస్ సేవలకు ప్రజల ప్రశంసలు**
**సర్పంచ్ చొరవతో మెగా ఉచిత వైద్య శిబిరం**
**124 మందికి గుండె, కంటి, బీపీ, షుగర్ పరీక్షలు**




**జై భీమ్ న్యూస్ । పర్వతగిరి । జూలై 22**

గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా సోమారం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ ఎర్రుల శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, ప్రజ్వల్ ఫపీసీల్ సంస్థ సహకారంతో మెడికవర్ హాస్పిటల్ మరియు శరత్ హాస్పిటల్ వైద్య బృందాలు గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించాయి. శిబిరంలో గుండె పరీక్షలు (ఈసీజీ ), రక్తపోటు (బీపీ ), షుగర్ పరీక్షలు, ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మొత్తం 124 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వైద్య సూచనలు అందించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని పెద్ద ఎత్తున వినియోగించుకుని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రుల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఆరోగ్యవంతమైన గ్రామమే అభివృద్ధికి పునాది. రైతులు, మహిళలు, యువత ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది. అందుకే బీసీఐ కాటన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను గ్రామానికి తీసుకురావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ ఫపీసీఎల్ మేనేజర్ గటిక మృదుల, గ్రామపంచాయతీ కార్యదర్శి మమత, వార్డు సభ్యుడు సర్దార్, ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు కందికట్ల స్కైలాబ్ బాబు, సీనియర్ సామాజిక కార్యకర్త గడ్డం యాకయ్య, సుజాత, కోమల, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు, మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ ఎర్రుల శ్రీనివాస్ సేవలను గ్రామస్థులు కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన తీసుకుంటున్న కార్యక్రమాలు సోమారం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# రంగనాథ్‌కు హైకోర్టు షాక్!

**తొలగించాలని సీఎస్‌కు ఆదేశం**
**కోర్టు ధిక్కరణ కేసుల్లో తీవ్ర ఆగ్రహం**
**వెంటనే ప్రత్యామ్నాయ అధికారిని నియమించాలని స్పష్టీకరణ**

**హైదరాబాద్ - జూలై 27(జై భీమ్ న్యూస్)**

హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసుల విచారణ సందర్భంగా ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో రంగనాథ్ స్థానంలో సమర్థుడైన ప్రత్యామ్నాయ అధికారిని వెంటనే నియమించాలని స్పష్టం చేసింది.కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జరిగిన నిర్లక్ష్యం, పదేపదే ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై దాఖలైన పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లను హైకోర్టు విచారించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ వాదనలు విన్న ధర్మాసనం, న్యాయస్థానం ఆదేశాలను పట్టించుకోకపోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని వ్యాఖ్యానించింది.ఈ నేపథ్యంలో రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, ఆయన స్థానంలో అనుభవం కలిగిన అధికారిని నియమించాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలపై తదుపరి విచారణ నాటికి పూర్తి నివేదిక సమర్పించాలని కూడా స్పష్టం చేసింది.హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రంగనాథ్‌పై ఇటీవల కూల్చివేతలు, నోటీసులు, కోర్టు ఆదేశాల అమలు అంశాల్లో పలు వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు తాజా ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం కొత్త కమిషనర్ నియామకంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.






# పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను అప్పగించిన కాజీపేట పోలీసులు

**కాజీపేట, 27 జూలై 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రజలకు భరోసాగా నిలుస్తూ కాజీపేట పోలీసులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. జూడియో షోరూమ్‌లో పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను గుర్తించి యజమానికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. డీజిల్ కాలనీకి చెందిన నరేష్ జూడియో షోరూమ్‌లో షాపింగ్ చేస్తున్న సమయంలో తన బంగారు బ్రాస్‌లెట్‌ను అనుకోకుండా పోగొట్టుకున్నారు. దీంతో ఆయన కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్‌హెచ్‌ఓ శ్యాంసుందర్ వెంటనే స్పందించి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ ఆదేశాల మేరకు క్రైమ్ పీసీలు వి. క్రాంతి కుమార్, కుమార్‌లు సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి పోయిన బంగారు బ్రాస్‌లెట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని యజమాని నరేష్‌కు అప్పగించారు. తన పోగొట్టుకున్న విలువైన బంగారు ఆభరణాన్ని తిరిగి అందజేసినందుకు నరేష్, ఆయన కుటుంబ సభ్యులు సీఐ శ్యాంసుందర్, క్రైమ్ పీసీలు వి. క్రాంతి కుమార్, కుమార్‌తో పాటు కాజీపేట పోలీసు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణకు, పోయిన వస్తువులను గుర్తించి బాధితులకు అప్పగించడంలో కాజీపేట పోలీసులు చూపుతున్న చొరవ అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు. ప్రజాసేవే లక్ష్యంగా కాజీపేట పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.






# వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**మడిపల్లి రైతు వేదికలో కంటింజెన్సీ విత్తన మేళా**
**రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ**
**మండల వ్యవసాయ అధికారి ఎ. అనూరాధ**

**హసన్‌పర్తి, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందకుండా పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు విధానాన్ని మార్చుకుని తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల వ్యవసాయ అధికారి ఎ. అనూరాధ సూచించారు. రైతులకు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను అందుబాటులో ఉంచే ఉద్దేశంతో హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి రైతు వేదికలో సోమవారం కంటింజెన్సీ విత్తన మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వ్యవసాయ అధికారులు రైతులతో ప్రత్యక్షంగా చర్చించి, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల మట్టం క్రమంగా తగ్గిపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గే అవకాశం, విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల సాగునీటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలను వివరించారు. ఈ నేపథ్యంలో అధిక నీటి అవసరమయ్యే వరి సాగును వీలైనంత వరకు తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, కంది, పెసర, అలసంద వంటి పప్పుధాన్యాలతో పాటు కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎ. అనూరాధ మాట్లాడుతూ, వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు పెట్టుబడులను ఆదా చేసుకోవడంతో పాటు దిగుబడులను కూడా కాపాడుకోవచ్చన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం నేటి పరిస్థితుల్లో అత్యంత అవసరమని, ప్రతి రైతు నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న సాంకేతిక సూచనలను పాటిస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. కంటింజెన్సీ విత్తన మేళాలో రైతుల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి కంది, పెసర, అలసంద, మొక్కజొన్న విత్తనాలతో పాటు సొరకాయ, బీరకాయ, కాకరకాయ, బెండకాయ, టమాట, మిర్చి, పాలకూర, కొత్తిమీర తదితర కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను అందుబాటులో ఉంచారు. విత్తనాల నాణ్యత, సాగు విధానం, ఎరువుల వినియోగం, పంటల సంరక్షణ, చీడపీడల నివారణపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ అవసరమైన విత్తనాలను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుమనావాణి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా రైతులు వ్యవసాయ కుంటలు (ఫార్మ్ పాండ్స్) నిర్మించుకోవచ్చని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఈ కుంటలు పంటలకు అవసరమైన సమయంలో సాగునీటిని అందించడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరగడానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ బుర్ర రంజిత్, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, జయగిరి సర్పంచ్ తాళ్లపెల్లీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సుమనావాణి, మండల వ్యవసాయ అధికారి ఎ. అనూరాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు బందెల సుమన్, సాయి, పంచాయతీ కార్యదర్శులు రాజ్ నాయక్, రవీందర్, అంచూరి విజయ్ కుమార్, ఎస్‌ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు, హసన్‌పర్తి మండల రైతులు చిర్ర విజయ్ కుమార్, మెరుగు ఐలుమల్లు, బుర్ర రాజు, రవీందర్, విత్తనాలు, ఎరువుల డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఉద్యమ సేవలకు గుర్తింపు...

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా చిలువేరు రమేష్**



**హన్మకొండ, 26 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టియూఎఫ్) రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా చిలువేరు రమేష్‌ను రాష్ట్ర కమిటీ నియమించింది. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలు, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఫోరం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా చిలువేరు రమేష్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానకీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకం కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు, కార్యదర్శి డాక్టర్ కృష్ణారావుతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను తెలంగాణ ఉద్యమకారుల ఫోరంకు పరిచయం చేసి, ఉద్యమంలో ముందుకు నడిపించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరంలో హసన్‌పర్తి మండల అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పలు బాధ్యతలు నిర్వహించిన ఆయన, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్--వేములవాడ పాదయాత్ర, మానుకోటలో నిర్వహించిన రాళ్లను ముద్దాడినప్పుడు పాదయాత్ర, ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లో నిర్వహించిన చండీయాగంలో పాల్గొన్నారు. అదేవిధంగా సచివాలయం ముట్టడి, ప్రజాభవన్ ముట్టడి వంటి ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఐఏఎస్ శేషాద్రితో జరిగిన చర్చల్లో పాల్గొని, కేకే కమిటీని జీవో ప్రకారం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని చిలువేరు రమేష్ స్పష్టం చేశారు. కేకే కమిటీ కాలయాపన చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, పోరాడితే పోయేది ఏమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఖాకీ ముసుగులో కీచకుడు.. వీడియోలతో బెదిరించి రూ.2 కోట్ల దోపిడీ..!

**రెండేళ్లుగా లైంగిక వేధింపుల ఆరోపణలు.. డీజీపీకి బాధిత మహిళ ఫిర్యాదు**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర పోలీసు శాఖను కలవరపరిచే సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ సీఐపై మహిళ తీవ్ర ఆరోపణలు చేస్తూ డీజీపీకి ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. కుటుంబ సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో సదరు సీఐ పరిచయం పెంచుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా దోపిడీ చేశాడని ఆరోపించింది. ఆ సమయంలో తీసిన వ్యక్తిగత వీడియోలను అడ్డంగా పెట్టుకుని రెండేళ్లుగా బ్లాక్‌మెయిల్ చేస్తూ సుమారు రూ.2 కోట్లు వసూలు చేశాడని తెలిపింది. అంతేకాకుండా గర్భం దాల్చిన తర్వాత బలవంతంగా అబార్షన్ చేయించాడని, శారీరకంగా, మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడని తన ఫిర్యాదులో పేర్కొంది. గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్న బాధిత మహిళ, నిష్పక్షపాత విచారణ జరిపి నిందిత సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరింది. అలాగే తనకు పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.




# పెండింగ్ ట్యాక్స్‌లు చెల్లించని కమర్షియల్ వాహనాలపై కఠిన చర్యలు: డీటీవో శంకర్ నాయక్

**మహబూబాబాద్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని కమర్షియల్ వాహన యజమానులు పెండింగ్‌లో ఉన్న వాహన పన్నులను గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా అధికారి (డీటీవో) శంకర్ నాయక్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని రకాల కమర్షియల్ వాహనాల యజమానులు, ముఖ్యంగా ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (గ్రాఖజ) సర్టిఫికెట్ తదితర పత్రాలను ఎల్లప్పుడూ చెల్లుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొంతమంది వాహన యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందకపోవడం, పర్మిట్‌ను పునరుద్ధరించకపోవడం, వాహన పన్నులు సకాలంలో చెల్లించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అలాగే కొందరు రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ లేకుండానే వాహనాలను నడుపుతుండగా, మరికొందరు వాహనం కొనుగోలు చేసినప్పటి నుంచి వాహన పన్ను చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న వాహన పన్నులను మీ సేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని డీటీవో శంకర్ నాయక్ సూచించారు. గడువులోగా ట్యాక్స్‌లు చెల్లించని కమర్షియల్ వాహన యజమానులపై, ముఖ్యంగా ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడంతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి






**కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**
**కేయూ-టి-హబ్ అవగాహన ఒప్పందంలో భాగంగా ప్రత్యేక ఇండక్షన్ కార్యక్రమం**

**కేయూ క్యాంపస్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా భవిష్యత్ ఉద్యోగ సృష్టికర్తలుగా (ఫ్యూచర్ జాబ్ క్రియేటర్స్) ఎదిగి దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న అధ్యక్షతన, కాకతీయ విశ్వవిద్యాలయం--తెలంగాణ టి-హబ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లో భాగంగా విద్యార్థుల్లో వ్యవస్థాపకత, స్టార్టప్‌లపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రత్యేక ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, వనరులను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నవకల్పన (ఇన్నోవేషన్), వ్యవస్థాపకత సంస్కృతిని ప్రోత్సహించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం టి-హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా సుమారు 3,000 మంది విద్యార్థులకు అవకాశాలు కల్పించి, టి-హబ్ మెంటరింగ్ సహకారంతో వారి వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా కనీసం 10 అంకుర సంస్థలు (స్టార్టప్‌లు) ఆవిర్భవిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి వినూత్న ఆలోచనకు విలువ ఉంటుందని, నేడు ఉపయోగపడకపోయినా భవిష్యత్తులో తప్పకుండా ఫలితాన్నిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను నమోదు చేసుకొని వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణలో ఇన్నోవేషన్, స్టార్టప్‌లకు కేంద్రబిందువుగా మారుతుందని పేర్కొంటూ, విద్యార్థులు తమ ప్రతిభపై విశ్వాసం పెంచుకుని ముందుకు సాగాలని, ప్రతిభకు సాటి మరొకటి లేదని ప్రోత్సహించారు. ఇక్కడ పొందే శిక్షణ, అనుభవం జీవితాంతం ఉపయోగపడుతుందని అన్నారు. ఇటీవల జర్మనీ పర్యటన సందర్భంగా ర్యూట్లింగెన్ యూనివర్సిటీతో విద్యా, పరిశోధనా సహకారంపై చర్చలు జరిగాయని తెలిపారు. ఆ అవగాహన ఒప్పందం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు 4ం1, 3ం2 డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అలాగే రెండు వారాల జర్మనీ విద్యా పర్యటనను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా మరో ప్రముఖ సంస్థతో కూడా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆ సంస్థ సహకారంతో విశ్వవిద్యాలయంలో రెండో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్టార్టప్‌ల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, విద్యార్థులు ఉద్యోగాల కోసం వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే భావి వ్యవస్థాపకులుగా ఎదగాలని సూచించారు. కే-హబ్, టి-హబ్ ద్వారా నిపుణుల మార్గదర్శకత్వం, మెంటరింగ్, ఇన్నోవేషన్ కార్యకలాపాలు, ఇంక్యుబేషన్ అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకొని విజయవంతమైన స్టార్టప్‌లను స్థాపించాలని కోరారు. టి-హబ్ ప్రతినిధి శ్రవణ్ ఎరుగుల మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి దరఖాస్తు చేసుకున్న సుమారు 1,700 మంది విద్యార్థుల్లో ఎంపిక ప్రక్రియ ద్వారా 400 మందిని ఈ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి 12 నుంచి 15 ప్రత్యేక శిక్షణా సెషన్లు నిర్వహించి, వ్యవస్థాపకత, స్టార్టప్‌లపై అవగాహన కల్పించడంతో పాటు వారి పురోగతిని నిరంతరం పరిశీలిస్తామని చెప్పారు. రూసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఉద్యోగులుగా (ఎంప్లాయీస్) కాకుండా ఉద్యోగాలు కల్పించే యజమానులుగా (ఎంప్లాయర్స్) ఎదగాలని సూచించారు. తమ ఆలోచనలను విజయవంతమైన స్టార్టప్‌లుగా తీర్చిదిద్ది వ్యాపార అవకాశాలుగా మలచే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి-హబ్ ప్రతినిధులు ఆశిష్ శర్మ, భరత్, కే-హబ్ సంయుక్త సంచాలకులు సిద్ధార్థ్, బొల్లం కిరణ్, ఆచార్య ఎన్. రమణ, ఆచార్య కె. భిక్షాలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండలో ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించిన డాక్టర్ అనితా రెడ్డి

**హనుమకొండ, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను ఆమె సందర్శించి, అక్కడి వృద్ధుల ఆరోగ్య పరిస్థితులు, సంక్షేమం, అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ లైబ్రరీ కోసం పలు పుస్తకాలను అందజేశారు. కేంద్రంలోని ప్రతి వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రణామ్ సెంటర్ల సేవలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే ట్రిబ్యునల్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ చట్టం--2007 మరియు నిబంధనలు--2011 గురించి వివరించారు. వయోవృద్ధులకు ట్రిబ్యునల్ బెంచ్ ఒక వరమని, వేధింపులు, నిర్లక్ష్యం లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని సూచించారు. వృద్ధులను వేధించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే తమ ఆస్తులన్నింటినీ పూర్తిగా పిల్లలకు బదిలీ చేయకుండా, తమ అవసరాలకు అవసరమైన భాగాన్ని ఉంచుకొని, అనంతరం అమలయ్యే విధంగా వీలునామా (విల్) రాసుకోవడం మంచిదని సూచించారు. వృద్ధులను గౌరవించడం, ప్రేమించడం భారతీయ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. తల్లిదండ్రులను ప్రేమించకుండా, వారిని ఇబ్బందులకు గురిచేసే వారు ఎంతటి కోటీశ్వరులైనా నిజమైన దరిద్రులేనని అన్నారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యతను పిల్లలు ఎప్పటికీ మరువకూడదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, ప్రణామ్ డే కేర్ సెంటర్‌లోని వయోవృద్ధులు, ప్రణామ్ సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

## దేశాయిపేటలో తెలంగాణ మోడల్ హైస్కూల్ నిర్మించాలి

**5 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి విద్యాసంస్థ ఏర్పాటు చేయాలి**
**బీఎస్పీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జన్ను అనిల్ కుమార్**

**వరంగల్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని దేశాయిపేటలో నెహ్రూ మెమోరియల్ ఎయిడెడ్ హైస్కూల్‌కు చెందిన సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల నుంచి రక్షించి, అదే స్థలంలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించే తెలంగాణ మోడల్ హైస్కూల్‌ను నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వరంగల్ జిల్లా నాయకులు జిల్లా కలెక్టర్ సత్య శారదకు ప్రజాపాలన కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జన్ను అనిల్ కుమార్ మాట్లాడుతూ, దేశాయిపేటలోని నెహ్రూ మెమోరియల్ ఎయిడెడ్ హైస్కూల్ పరిధిలో సుమారు 5 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండడంతో కొందరు ఆక్రమణలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దేశాయిపేట పరిసర ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని, ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ విద్యాసంస్థ లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే సదరు 5 ఎకరాల ప్రభుత్వ భూమికి సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని, అదే స్థలంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ మోడల్ హైస్కూల్‌ను (ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు) మంజూరు చేసి నిర్మించాలని బీఎస్పీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు, ప్రధాన కార్యదర్శి పోలేపాక శ్రీధర్, కార్యదర్శి జన్ను మనోహర్, వర్ధన్నపేట ఇన్‌చార్జ్ అడ్డూరి సమ్మయ్య, బీఎస్పీ సీనియర్ నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డా. ఓ. రవీందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**భార్యకు శాశ్వత ఉద్యోగం, కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలి**
**కేయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ - వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం అందజేత**

**కేయూ క్యాంపస్, 27 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 22 సంవత్సరాలకు పైగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందించిన దివంగత డా. ఓ. రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వం, విశ్వవిద్యాలయం తక్షణమే ఆదుకోవాలని కేయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డా. పి. కరుణాకర్ రావు, డా. సాదు రాజేష్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాల వివక్షపూరిత వైఖరికి డా. ఓ. రవీందర్ వంటి ఘటనలు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత డా. రవీందర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆయన భార్యకు కాకతీయ విశ్వవిద్యాలయంలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని, కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, భవిష్యత్తులో డా. రవీందర్ వంటి విషాద ఘటనలు మరే కాంట్రాక్ట్ అధ్యాపకుడి జీవితంలో చోటుచేసుకోకుండా, విశ్వవిద్యాలయం నిర్వహించనున్న ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ వేతనాలు అమలు చేసే అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వైస్ ఛాన్సలర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డా. చిర్ర రాజు, డా. బి. సతీష్, డా. మాదాసి కనకయ్య, డా. బిక్షపతి, డా. శ్రీధర్ కుమార్ లోడ్, డా. చంద్రశేఖర్, డా. జూల సత్య, డా. ఆరూరి సూర్యం, డా. శ్రీనివాస్, వెంకట వెంకటేష్, తూర్పాటి తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో ముగ్గురు ఇంజనీరింగ్ విభాగాలకు కొత్త విభాగాధిపతులు







**కంప్యూటర్ సైన్స్, ఈసీఈ విభాగాలకు కొత్త నియామకాలు**
**మెకానికల్ విభాగాధిపతిగా డాక్టర్ రాధికకు మరో రెండేళ్ల పదవీకాలం**

**కేయూ క్యాంపస్, 27 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగాల పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగాలకు కొత్త విభాగాధిపతులను నియమించడంతో పాటు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా డాక్టర్ రాధిక పదవీకాలాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆచార్య ఎం. సదానందం రెండేళ్ల కాలానికి నియమితులయ్యారు. ప్రస్తుతం విభాగాధిపతిగా ఉన్న ఆచార్య ఎన్. రమణ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆచార్య సదానందం గతంలో ఇంజనీరింగ్ విభాగాల డీన్‌గా, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా, హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా పలు కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగాధిపతిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ బి. శ్రీకాంత్ రెండేళ్ల కాలానికి నియమితులయ్యారు. ప్రస్తుతం ఈసీఈ విభాగాధిపతిగా ఉన్న ఆచార్య కె. భిక్షాలు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 2010లో కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరిన డాక్టర్ శ్రీకాంత్ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా, హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్‌గా పలు పరిపాలనా బాధ్యతలు నిర్వహించారు. విద్యా, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన ఆయన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 15కు పైగా పరిశోధనా పత్రాలు సమర్పించడంతో పాటు రెండు పేటెంట్లను కూడా పొందారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా డాక్టర్ రాధిక పదవీకాలాన్ని మరో రెండేళ్లపాటు పొడిగించారు. 2024 నుంచి ఆమె విభాగాధిపతిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పదవీకాలాన్ని కొనసాగిస్తూ విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆచార్య ఎం. సదానందం, డాక్టర్ బి. శ్రీకాంత్, డాక్టర్ రాధికలను విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## లారీని ఢీకొన్న బస్సు: ప్రయాణికులకు తప్పిన ముప్పు

**జోగులాంబ గద్వాల,జూలై27(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలోని ఘర్ దాబా వద్ద ఓ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన బస్సును ఇంటర్‌సిటీ స్మార్ట్ బస్సుగా గుర్తించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ.. బస్సులో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM